www.prajasakti.com

# ప్రజాశక్తి

మంగళవారం 11 జులై 2023

5

తిరుపతి



### అంగన్‌వాడీలంటే చిన్నచూపెందుకు...?

**వాణీశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి**

రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్‌వాడీల పట్ల చిన్నచూపు తగదు.. ఎన్నికలపుడు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని మాత్రమే అమలు చేయాలని మేం కోరుతున్నాం.. మాదేమీ గొంతెమ్మ కోర్కె కాదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. వెట్టిచాకిరీ చేయించుకోవడం తప్ప 12ఏళ్లుగా వేతనం పెంచలేదు. తెలంగాణా కన్నా ఎక్కువ వేతనం ఇస్తామని చెప్పారు. కేవలం 11,500 మాత్రమే ఇస్తున్నారు. కనీస వేతనం రూ.26వేలివ్వాలి.

### మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

**ఎం.హైమావతి, నాయుడుపేట**

మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి. మూడు వందల జనాభా కలిగిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. అంగన్‌వాడీలో చదివే పిల్లలకూ యూనిఫాంతో పాటు అమ్మఒడి ఇవ్వాలి. హెల్పర్‌కు వయో పరిమితి 50 ఏళ్లు పెంచాలి. గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించి 164 పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. హత్యకు గురైన హనుమాయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

# కలెక్టరేట్లో ...అంగన్'వేడి'..!

- కనీస వేతనం ఇవ్వాలంటూ 36 గంటల దీక్ష
- ఐసిడిఎస్ పరిరక్షణ... ఉద్యోగ భద్రతే డిమాండ్లు
- వేలాదిగా కదం తొక్కిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల దీక్షలో ప్రసంగిస్తున్న కందారపు మురళి

వేలాదిగా తరలి వచ్చిన అంగన్‌వాడీలు

వాళ్ల పోరాటం... సుదీర్ఘం.. 'మాట తప్పను... మడమ తిప్పను' అని పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ డిమాండ్... బాలింతలకు, చిన్నారులకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న సేవలకు గుర్తింపుగా కనీస వేతనం, గ్రాడ్యుటీ పెంచాలంటూ కదం తొక్కారు.. కలెక్టరేట్‌కు వందలాదిగా చేరుకున్నారు.. సోమవారం 36 గంటల దీక్షను ప్రారంభించారు.. హామీని అమలు చేసేంత వరకూ వదిలేది లేదంటూ 'పట్టు'బట్టారు.. సోమవారం వాతావరణం మేఘావృతమై చల్లగా ఉన్నా అంగన్‌వాడీల నినాదాలతో కలెక్టరేట్ 'వేడెక్కింది'... మాట తప్పం... మడమ తిప్పం.. మహిళలమైనా వెన్ను చూపం... డిమాండ్లు సాధించేంత వరకూ పోరాడతాం.. పోరాడతాం అంటూ చిమ్మచీకట్లోనూ రాత్రివేళ కలెక్టరేట్ ప్రాంగణంలోనే నిద్రించారు.. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దిగివచ్చేంత వరకూ తాము తగ్గేదే లేదంటూ పిడికిళ్లు బిగించారు.. ఆట, పాట, సామూహిక భోజనాలు, సామూహిక నిద్రతో ఐక్య పోరాటానికి నాంది పలికారు. వీరి పోరాటానికి సిఐటియు వెన్నంటే ఉండి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించింది.

ప్రసంగిస్తున్న వాడా గంగరాజు

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా తిరుపతిలో చేపట్టిన 36 గంటల మహాధర్నాకు కలెక్టరేట్‌కి అంగన్‌వాడీలు కదంతొక్కారు. సిఐటియు అనుబంధ సంఘం ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం వేకువజాము నుంచే తిరుపతి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అంగన్‌వాడీలు తమ ఆందోళనతో జిల్లా పాలనాధికారి కార్యాలయాన్ని అట్టుడుకించారు. ర్యాలీలో కేంద్ర, రాష్ట్ర పాలకుల నియంతృత్వ ధోరణిని నిరసిస్తూ అంగన్‌వాడీలు నల్లచీరలు ధరించి, ఎర్రజెండాలు చేతబూని భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభస్థలానికి చేరుకుని అంగన్‌వాడీల ఆక్రోశాన్ని వెలగక్కారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ నేడు దేశ వ్యాప్తంగా 14 లక్షల సెంటర్లకు చెందిన అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఐసిడిఎస్‌కు 95వేల కోట్ల రూపాయలను మోడి ప్రభుత్వం కోత విధించి నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇదేమని ప్రశ్నిస్తే కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి, ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అద్యక్ష, కార్యదర్శులు పద్మనీల, వాణిశ్రీలు మాట్లాడుతూ మోడి ప్రభుత్వం అంగన్‌వాడీలకు గత 12 సంవత్సరాలుగా ఒక రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. పాదయాత్రల సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి 26వేల రూపాయలకు తగ్గకుండా వేతనం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీల పరిస్థితి ప్రస్తుతం దారుణంగా ఉందన్నారు. ఏదైన ఇబ్బంది వల్ల ఒక రోజు లీవు పెట్టాలంటే కూడా నలుగురి వద్ద నుంచి పర్మిషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మిని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని డిమాండు చేశారు. 36 గంటల నిరసనకైనా స్పందించి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీలకు న్యాయం చేయకపోతే రాబోవు ఎన్నికల్లో జగన్‌కూ చంద్రబాబుకు పట్టిన గతి తప్పదని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి ఆర్.లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలది న్యాయమైన కోర్కెలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం కోశాధికారి కేఎన్ఎన్ ప్రసాదరావు, టిటిడి యూనియన్ నేత టి. సుబ్రహ్మణ్యం, పార్థసారథి లతో పాటు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జయచంద్ర, నరేంద్ర,ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు జయంతి, సాయి లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్, ఆర్టీసీ నేతలు ఈఎస్ కుమార్, భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ యూనియన్ నేత జి నాగ వెంకటేష్, రామకష్ణ, వేణుగోపాల్, మునిరాజ, బుజ్జి, రమేష్, గురవయ్య, వెంకటేశు, ముకుంద, హరినాథ్, చెంగయ్య, నాగరాజు, అంగన్వాడీ నేతలు హైమావతి, స్వరూపరాణి, ప్రభావతి, శ్యామలమ్మ హెప్సిబా, మునికుమారి, ప్రభావతి, నిర్మల, ఇంద్రాణి, నాగరాజమ్మ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట రాత్రి సైతం సెల్‌ఫోన్ల వెలుతురులో...నిరసన

తిరుపతి కలెక్టరేట్ ఎదుట రాత్రి నిద్రిస్తూ...నిరసన

**ప్రజాశక్తి - చిత్తూరు**

కోర్కెల దినోత్సవం సందర్భంగా 36 గంటలు నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్ అట్టుడికింది. వేలాదిమంది అంగన్వాడీలు భారీగా కదం తొక్కారు. మొదట రోజు నల్ల చీరలతో నిరసన ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపీ లలిత అధ్యక్షత వహించారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడి వర్కర్స్ అని హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీలా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పి హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించడం దుర్మార్గమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి ఇవ్వాలని, అర్హులైన హెల్పర్స్‌కి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వేలాదిగా తరలి వచ్చిన అంగన్‌వాడీలు

సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షుడు పి.చైతన్య, కే సురేంద్రన్, వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వలన ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగానే ఐసిడిఎస్‌కు నిధులు తగ్గిస్తున్నారని దేశంలో ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులైన ఆదాని, అంబానీలకు అప్పగిస్తున్నారని దీనిని ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అనేక ప్రాజెక్టులు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ప్రమోషన్లు, అంగన్వాడి పోస్టు భర్తీ చేస్తున్నారని దీని మానుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్లకు ప్రజా సమస్యలను వినడానికి తీరిక లేకుండా పోయిందని వెంటనే అంగన్వాడీల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిపి అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక ప్రభుత్వాలకు అంగన్వాడీల సంఘటిత శక్తి ఏంటో రుచి చూపించారని ఈ ప్రభుత్వం కూడా వెంటనే మేల్కొని అంగన్వాడీల ఆగ్రహానికి గురికాకముందే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా పిడి వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, బెదిరింపు ధోరణి మానుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రకరకాల యాపులతో ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రమీల, కస్తూరి ,శ్యామల, అనిత, జమున, సుజని ,విజయ, మమత పంచవర్మ ధనకోటి, లీల, సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తా దాస్, లక్ష్మయ్య లతోపాటు భారీ సంఖ్యలో అంగన్వాడి వర్కర్లు మినీ వర్కర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.

**టిడిపి మహిళా అధ్యక్షురాలు సంఘీభావం**

అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన 36 గంటల నిరసన కార్యక్రమానికి జిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ సంఘీభావం తెలిపారు. కుప్పం నియోజకవర్గం నుండి 100 మంది తెలుగు మహిళలు విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు సుగుణమ్మ, మహిళ సెక్రటరీ చంద్రకళ పాల్గొన్నారు.

### యాప్‌ల పేరుతో వేధింపులు మానుకోవాలి

**కె ఇంద్రాణి, పిచ్చాటూరు**

ఇటు కేంద్రానికి సంబంధించిన పోషణ్ యాప్, రాష్ట్రానికి చెందిన వైఎస్ఆర్ యాప్ ఇవ్వడం వల్ల అంగన్‌వాడిలకు భారంగా మారింది. సరిహద్దు ప్రాంతాల్లో నెట్‌వర్కు సరిగ్గా రాదు. పని చేయకపోతే అధికారులు వేధిస్తారు. సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాల్లోనెట్‌వర్కు సమస్య తీవ్రంగా ఉంది. అప్‌లోడ్ చేయకపోతే చర్యలు తీసుకుంటున్నారు. బాలింతలకు కిట్లు సక్రమంగా ఇవ్వడం లేదు. రాజకీయ నాయకుల వేధింపులు మానుకోవాలి.

### ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలి

**శాంతి**

ఉద్యోగ విరమణ చేసిన తరువాత రూ 5లక్షలు, వేతనంలో సగం పింఛన్ ఇవ్వాలి. 2017 నుంచి అంగన్‌వాడీలకు జీతాలు పెంచలేదు. కేంద్రం తీసుకొచ్చిన జీవో ఇంతవరకూ అమలుకు నోచుకోలేదు. మినీ వర్కర్లకు వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. వైఎస్ఆర్, సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. ఐసిడిఎస్‌ల నిర్వీర్యానికి కుట్ర జరుగుతోంది. సమస్యలు పరిష్కరించుకునేందుకు పోరాటాలను ఉధృతం చేయాలి.

### సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**నాగరాజమ్మ, తిరుపతి**

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. ప్రభుత్వ ఉద్యోగం పేరుతో పథకాలు ఆపివేయడం అన్యాయం, వేతనాలు చూస్తే ఉపాధి కూలికన్నా తక్కువ ఇస్తున్నారు. అంగన్‌వాడీల బలోపేతానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి. ఇతర రాష్ట్రాల్లో అంగన్‌వాడీల సమస్యలపై ఆయా ప్రభుత్వాలు స్పందిస్తున్నాయి. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నారు. అందుకే 36 గంటల దీక్ష చేస్తున్నాం.

### నూతన విద్యావిధానం రద్దుచేయాలి

**రాజేశ్వరి**

ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి. కక్షసాధింపులకు పాల్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పిల్లలకు సరిపడా పోషణ పంపిణీ చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు ఇవ్వాలి. రాయితీ గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం పంపిణీ చేయాలి. గ్రాడ్యుటీ అమలు చేసి ఆదుకోవాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.నూతన విద్యా విధానం భవిష్యత్ తరాలకు ముప్పు.

# 'శ్రీజ'తో గ్రామీణ మహిళల్లో చైతన్యం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

గ్రామీణ మహిళల్లో చైతన్యం నింపుతున్న 'శ్రీజ'ను పుదుచ్చేరి మాజీ రాష్ట్ర గవర్నర్ కిరణ్‌బేడీ అభినందించారు. సోమవారం తిరుపతి -కరకంబాడి మార్గంలోని ఓ ప్రైవేటు హోటల్లో శ్రీజ సంస్థ పదో యేటలోకి అడుగుపెట్టిన సందర్భంగా శ్రీజ సంస్థ సంబరాలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ నుండి కిరణ్ బేడీ వర్చువల్ విధానంలో శ్రీజ సంస్థ సభ్యులతో, అతిథులతో ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం మహిళాభ్యుదయానికి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తోందని, వాటి సమాచారాన్ని దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో ద్వారా దేశ ప్రజలకు తెలియజేస్తుందన్నారు. దేశంలోని పాడి రైతుల ఆర్థిక అభివద్ధికి శ్రీజ లాంటి సంస్థలను నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాలు పోస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నామని శ్రీజ సభ్యులు చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలను ఇంతగా ప్రోత్సాహకాలు అందించి ఆర్థిక చైతన్యవంతులుగా శ్రీజ సంస్థ చేస్తున్న కషి గొప్పదని అమర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ గొర్ననేని రమాదేవి కొనియాడారు. మహిళల అభివద్ధికి ఇంతగా దోహదపడుతున్న శ్రీజ సంస్థ వారికి తగిన సహకారం అందిస్తామన్నారు. శ్రీజ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జయతీర్థాచారి మాట్లాడుతూ 27 మంది సభ్యులతో 2014వ సంవత్సరంలో ప్రారంభమైన శ్రీజ అనతి కాలంలోనే లక్షకు పైబడి సభ్యులను కలిగి ఏడాదికి దాదాపు 1000 కోట్ల టర్నోవర్ ను చేరుకోబోతోందన్నారు. పదో వార్షికోత్సవం సందర్భంగా శ్రీజ సంస్థ సభ్యులకు 10 కోట్ల రూపాయల బోనస్ ను ఆన్లైన్ పద్ధతిలో నగదు బదిలీ చేయడం జరిగిందన్నారు. నెలలో రెండుసార్లు శ్రీజ సంస్థ సభ్యులకు నగదు చెల్లింపులు చేస్తున్నామని, ఇప్పటివరకు 3600 కోట్ల రూపాయలను వారి ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. శ్రీజ సంస్థ సభ్యులకు యాజమాన్య హక్కులను కల్పిస్తూ సంస్థ నిర్వహణలో మహిళలదే కీలక పాత్రగా బోర్డు పనిచేస్తుందన్నారు. మార్కెట్లో పోటీ ధరలను క్రమం తప్పకుండా బోనస్, డివిడెంట్లు, ఇతర ప్రోత్సాహకాలను సభ్యులకు చెల్లించడం జరుగుతొందన్నారు. శ్రీజ సంస్థ కార్యకలాపాలను ఇతర రాష్ట్రాలకు విస్తరింప చేయాలని ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు. శ్రీజ కంపెని అత్యుత్తమ విజయాలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన "సెక్స్ సార్టెడ్ సెమెన్" ప్రాజెక్ట్ ను రాయలసీమ ప్రాంతంలో అమలు చేసే ఏజెన్సీగా రాష్ట్రీయ గోకుల్ సేవా మిషన్ కింద ఎంపిక చేయబడిందని తెలిపారు. ఈ ముఖ్యమైన ప్రాజెక్ట్ ఆగష్టు 15, 2023న ప్రారంభించబడుతోందన్నారు. పాడిపశువులకు సహేతుకమైన ధరలో సెక్స్ -సార్టెడ్ వీర్యం అందుబాటులోకి తీసుకువస్తారని తెలియజేశారు. రాబోయే 3 సంవత్సరాల కాలంలో 600 పార్లర్ లను ఏర్పాటు చేసి వినియోగదారులకు శ్రీజ బ్రాండ్ ఉత్పత్తులను అందించేందుకు కషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీఐఎస్ఎస్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి లింగం, గ్రాన్యూల్స్ ఇండియా గ్లోబల్ సిహెచ్ఆర్ఓ ఉమా రావు, చిత్తూరు, తిరుపతి జిల్లాల డిఆర్డిఏ పీడీలు డీఎంకే తులసి, జ్యోతి, శ్రీజ సంస్థ చైర్మన్ కుంటపల్లి శ్రీదేవి, శ్రీజ సంస్థ కీలక నిర్వాహక ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రూ.10 కోట్ల బోనస్ విడుదల : చైర్మన్





1.10 కోట్ల రూపాయల చెక్కును సభ్యులకు అందిస్తున్న దృశ్యం

## ముచ్చటగా మూడోసారి... చంద్రునిపైకి వస్తున్నా..!

### 14న చంద్రయాన్-3 ప్రయోగం

**ప్రజాశక్తి-సూళ్లూరుపేట**

ప్రపంచ అంతరిక్ష పరిశోధనలో చంద్రునిపై ఉపగ్రహాలు పంపించడం ఎప్పటికప్పుడు కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం చంద్రయాన్-3 కూడా అంతే. ఇతర దేశాలు చంద్రునిపై కాలు మోపి ఎన్నో పరిశోధనలు చేపట్టినప్పటికీ భారత్ ఈ చల్లని గ్రహంపై ఇంకా ఉపగ్రహాన్ని సాఫ్ట్ గా దింపలేకపోతోంది. అయినప్పటికీ ప్రస్తుతం చంద్రయాన్-3 పై అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా తో పాటు ప్రపంచంలోని ఇతర దేశాల అంతరిక్ష శాస్త్రవేత్తలూ ఆసక్తి కనబరుస్తున్నారు. భారత్ ఇప్పటికి రెండుసార్లు ఈ దశలో అవాంతరాలు ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం చంద్రయాన్-3 లో ఉపయోగిస్తున్న ఉపకరణాలు అత్యంత శక్తివంతమైనవి. చంద్రుని కక్ష్య నుంచే భూమిపై పరిశోధనలు చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి.పైగా చంద్రుని దక్షిణ ధ్రువం పై ఇప్పటికీ ఏ దేశము చేయని పరిశోధనల కోసం చంద్రయాన్-3 ని ప్రయోగిస్తున్నారు.

**'షార్'లో కొనసాగుతున్న ఏర్పాట్లు**

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో చంద్రయాన్- 3 ప్రయోగం కోసం తుది ఏర్పాట్లు జోరందుకున్నాయి. భారత్‌కు ఇటీవల ఎంతో కలిసి వచ్చిన ఎల్వీఎం-3 రాకెట్‌ను చంద్రయాన్-3 ఉపగ్రహం ప్రయోగానికి ఉపయోగిస్తున్నారు. ఎల్వీఎం3 -04 పేరుతో ఈ రాకెట్ రూపొందించగా, 3900 కిలోల బరువైన చంద్రయాన్-3ని అలవోకగా చంద్రుని సమీపం వరకు మోసుకెళ్లే సామర్థ్యాన్ని ఈ భారీ రాకెట్ కలిగి ఉంది. ఈనెల 14న మధ్యాహ్నం రెండు గంటల 2.35 గంటలకు శ్రీహరికోటలోని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈ ప్రయోగం జరుగనుండగా 40 రోజుల అనంతరం ఆగస్టు 23న చంద్రునిపై ఉపగ్రహంలోని ల్యాండర్ సాఫ్ట్ గా దిగాల్సి ఉంది. అది జరిగిన తర్వాత ల్యాండర్లో అమర్చిన రోవర్ 14 రోజులపాటు చంద్రునిపై నిర్దేశించిన ప్రదేశంలో పరిశోధనలు జరిపి ప్రపంచ శాస్త్రవేత్తలకు సమాచారం అందిస్తుంది.

**21 వరకు లాంచ్ విండో**

మనకు చంద్రునికి దగ్గరగా ఉండే రోజుల్లోనే చంద్రయాన్ ఉపగ్రహాన్ని ప్రయోగించాల్సి ఉంది. ఈనెల 13 నుంచి 21వ తేదీ వరకు చంద్రుడు భూమికి దగ్గరగా వస్తాడు. దీనినే లాంచ్ విండో అంటారు. ఈ సమయాన్ని మనం ఉపయోగించుకుని చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తే అనుకున్న లక్ష్యానికి దాన్ని ప్రవేశపెట్టవచ్చు. అలా జరిగితే ఉపగ్రహంలోని ఇంధనం కూడా కలిసి వస్తుంది. ఈ లాంచ్ విండో కాలం వెళ్లిపోయిన తర్వాత మరో ఆరు నెలల పాటు చంద్రయాన్ని జరిపే అవకాశం లేదు. ఈ కారణంగా శాస్త్రవేత్తలు ఈనెల 14, 19 తేదీలు మధ్యనే షార్ నుంచి చంద్రయాన్-3ని ప్రయోగించాలని శ్రమిస్తున్నారు. ఒకవేళ మరో రోజు వాయిదా పడినా ఈనెల 15న కచ్చితంగా ఈ ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని శాస్త్రవేత్తలు ద్వారా తెలుస్తోంది.

### మామిడికి యాజమాన్య పద్ధతులు అవసరం : ఎడిఎ

**ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)**

మామిడిలో కాయల కోత అనంతరం చేసే యాజమాన్య పద్ధతులే వచ్చే ఏడాది పూత బాగా రావడానికి దోహదపడుతుందని తిరుపతి జిల్లా వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ భాస్కరయ్య తెలిపారు. రామచంద్రపురం మండలం నెత్తకుప్పం గ్రామం లో మామిడి పంటపై రైతులకు ఆయన శిక్షణ ఇచ్చారు. కాయలు కోసిన తరువాత 4 వారాలు చెట్లకు విశ్రాంతి ఇచ్చి చెట్లకు గాలి వెలుతురు బాగా సోకే విధంగా కత్తిరింపులు చెయ్యాలని రైతులకు సూచించారు. కత్తిరించిన బాగాలకు బ్లైటాక్స్ అనే మందును లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తర్వాత ఎకరాకు 3 ట్రాక్టర్ల పశువుల ఎరువు, 300 కిలోల జిప్సం వేసుకొని కలియదున్నాలని చెప్పారు. తరువాత చెట్లు చుట్టూ 6-9 అడుగుల దూరం లో గాడితీసి ప్రతి చెట్టుకు 1.5 కిలోల యూరియా, 3 కిలోల సూపర్ ఫాస్ఫేట్ , 1 కిలో పొటాష్ ఎరువులు వేసుకుని , తోటకు నీరు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ వేణుగోపాల్‌రావు, పట్టు పరిశ్రమ అధికారి భారతి, గ్రామ వ్యవసాయ సహాయకులు భరత్, వాలంటీర్లు భాను, సౌందర్య, తేజ పాల్గొన్నారు

# మురుగునీటి తొలగింపునకు చర్యలు

- 'పడకేసిన పారిశుద్ధ్యం' కథనానికి స్పందన

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** స్థానిక మున్సిపాలిటీ పరిధి 14వ వార్డులోని స్థానిక షాపువీధి ఎక్స్‌టెన్షన్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో సోమవారం ప్రజాశక్తిలో 'పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికపై కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది మురుగునీటి కుంటను పరిశీలించి కార్మికులచే నీటిని తొలగించారు. నిల్వ లేకుండా ఇంటి పక్కన ఉన్న వారికి మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని.. లేకుంటే చర్యలు తీసుకుంటామని సూచించారు. దోమల నివారణకు మురుగునీటి నిల్వ వద్ద బ్లీచింగ్ చల్లాలని.. చెత్త కుండీలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు.

## వై.జె.పి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక

**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** గూడూరు పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యు కళాశాల ఆడిటోరియంలో సోమవారం వై.జె.పి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎల్లసిరి గోపాల్ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి మాట్లాడుతూ గతంలో క్లబ్ తరపున పలు సేవాకార్యక్రమాలు చేపట్టామన్నారు. క్లబ్ సభ్యులు , దాతల సహకారం మరువలేనిదన్నారు. అనంతరం నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియ చేశారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి , ఆర్.వి రావు, దశరథ రామిరెడ్డి, వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో వాకాడు అభివృద్ధి శూన్యం

**ప్రజాశక్తి-వాకాడు:** టీడీపీలో వాకాడు అభివృద్ధి శూన్యమని.. సూళ్లూరుపేట వైసీపీ పరిశీలకులు, వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఏఎంసీ గూడం సమీపంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని.. నేడు పేద ప్రజలకు వారధిలా పనిచేస్తున్న వైసీపీపై .. తనపై అవినీతిపరుడని, కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నానని నోటికొచ్చినట్లు మాట్లాడటం సమంజసం కాదన్నారు. వైసీపీ పాలనలో అభివద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దువ్వూరు అజిత్ కుమార్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ మండల కన్వీనర్ ఏనుగు సుధాకర్‌నాయుడు, వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, దువ్వూరు మధురెడ్డి, వెంకటరత్నం నాయుడు, వాకాడు వైఎస్ సర్పంచ్ పాపారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** రాష్ట్రంలోని జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సెక్రటేరియస్ అసోసియేషన్ ఉద్యోగులు రాష్ట్ర భూగర్భ గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వేడుకున్నారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్రామ, వార్డు జూనియర్ లైన్‌మెన్ గ్రేడు-2 సెక్రటేరియస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ఎనర్జీ అసిస్టెంట్ ఇంధన సహాయకుడిగా నియమితులైన వారిని 2019 అక్టోబర్ 2 నుంచి సచివాలయ ప్రాంతాల పరిధిలోనే కాకుండా రాష్ట్రంలోని డిస్కంలలో పనిచేయించుకుంటూ ఇంధన సహాయకులుగా ఉండాల్సిన వారిని జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 గా పేరు పెట్టి సహాయకులుగా కాకుండా 11 కేవీ, 33 కేవీ వంటి అధిక ఓల్టేజ్ ఉన్న లైన్ల పనులను చేయించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎనర్జీ అసిస్టెంట్ లను చేసి విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి కారుణ్య నియామకాలను చేపట్టాలని కోరారు. ఆగస్టు 10వ తేదీ విజయవాడలో కన్నీటితో కాళ్లు కడిగితే కనికరం పుట్టేనా.. అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం సభ్యులు మధు ఆచారి, విగ్నేష్, నరసింహారెడ్డి, శీను, మోహన్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ వ్యాఖ్యలను వక్రీకరించడం దురదృష్టకరం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం, నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను ఎదుర్కొంటూ అక్రమ కేసులు బనాయించిన వారిని టిడిపి అధికారంలోకి వస్తే కాపాడుకుంటుందని నారా లోకేష్ చెప్పారని, అయితే వైసీపీ నాయకులు నారా లోకేష్ వ్యాఖ్యలను వక్రీకరించి ప్రచారం చేయడం దురదష్టకరమని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు యువత నాయకులు జ్ఞానేశ్వర్(నాని), మంగళం సతీష్ (నాని)పై దౌర్జన్యం చేసి కొట్టి రక్త గాయాలు చేసిన వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు అజయ్ కుమార్ ముందుగా వెళ్లి ఆసుపత్రిలో చేరి టిడిపిపై బురదజల్లే కార్యక్రమాన్ని చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. భూమన కరుణాకర్ రెడ్డి శాసనసభ్యులుగా ఎన్నిక కాక ముందు తిరుపతిలో ఎలాంటి వాతావరణం ఉన్నది, నేడు ఎలాంటి వాతావరణం ఉన్నదో అందరికీ తెలుసునన్నారు. స్థానిక శాసనసభ్యుడుగా తిరుపతి కేంద్రంగా జరిగిన ఏ ఎన్నికలనైనా ప్రశాంతంగా జరగనిచ్చారా అని భూమనపై ప్రశ్నించారు. తిరుపతి టిడిపి నగర అధ్యక్షులు వట్టికుంట శంకరనారాయణ మాట్లాడుతూ వైసీపీకి చెందినవారు ఇలాంటి ఎన్ని అక్రమ కేసులు బనాయించినా కార్యకర్తలను కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో గంజి సుధాకర్, ప్రభు, మునిరామయ్య, గంధం బాబు, రఘు, ధరణికుమార్ పాల్గొన్నారు.

# ఓజిలిలో విచ్చలవిడిగా ప్లాస్టిక్..!

● వాడకంతో బావితరాలకు ముప్పు ● రోగాల బారిన ప్రజలు, మూగజీవాలు
● యథేచ్ఛగా దుకాణాల్లో విక్రయాలు ● నిషేధంపై పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-ఓజిలి:** ఓజిలి మండలంలో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా మారుతోంది. ఎక్కడ బడితే అక్కడ ప్లాస్టిక్ విక్రయాలతో పాటు ప్రజల వాడకం సైతం అధికంగా మారింది. కూరగాయాల కొట్టు నుంచి హోటళ్ళు, దుకాణాల్లోనూ ప్లాస్టిక్ కవర్ల వాడకం తీవ్రంగా ఉంటోంది. ఈ ప్లాస్టిక్ సంచులు అతిగా వాడి ఎక్కడపడితే అక్కడ పడేయడం.. వీటిని రీసైక్లింగ్ చేసే అవకాశం లేకపోవడంతో భవిష్యత్తులో పెను ప్రమాదమే ఎదురవుతుందని పర్యావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ప్లాస్టిక్ డ్రైనేజీ, చెరువులు, నదులు ఇలా ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు ఉండిపోతున్నాయి. ఫలితంగా జంతువులు, పక్షులు, పలు కీటకాలు చనిపోతున్నాయి. భూగర్భజలం కాలుష్యం మొదలైన వాటితోపాటు విచక్షణారహితంగా ఉపయోగించే రసాయనాల కారణంగా పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. అధికారులు ప్లాస్టిక్‌పై నిషేధం విధించినా నామమాత్రంగా ఉంటుందే తప్ప పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధాన్ని సంబంధిత అధికారులు కట్టడి చేయలేక పోతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**అంతరించిపోతున్న మూగజీవాలు**

పర్యావరణానికి ప్లాస్టిక్ సంచులు చేస్తున్న హానితో పాటు పశువులు సైతం ప్లాస్టిక్ బారినపడి మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ సంచులను వినియోగించి ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల మూగజీవాలు వాటిని తిని జీర్ణించుకోలేక మతి చెందుతున్నాయి. వీటి సంఖ్య రోజురోజుకూ పెరగడంతో నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా మిలియన్ల పక్షులు సముద్ర జీవాలు కేవలం ప్లాస్టిక్ సంచులు వల్లే చనిపోతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### ప్లాస్టిక్‌తో పశువులకు హాని

పశువులకు నాలుగు రకాల పొట్టలు ఉంటాయి. పశువులు తినే మేత నాలుగు పొట్టలకు సరఫరా అవుతుంది. పశువులు ప్లాస్టిక్ తినడం వల్ల మేత జీర్ణించుకోలేక పోతున్నాయి.దీంతో ప్లాస్టిక్ కరగకపోవడంతో పశువులు మత్యువాత పడుతున్నాయి. పశువులు ప్లాస్టిక్ సంచులు తినకుండా తగు జాగ్రత్త తీసుకోవాలి.

- డాక్టర్ బి.గౌతమ్, పశువైద్యాధికారి, ఓజిలి

### చర్యలు తీసుకుంటాం

ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతాం. గుడ్డ సంచులను వాడటంతో కలిగే లాభాలను వివరిస్తాం. 40 మైక్రాన్లలోపు ఉండే ప్లాస్టిక్‌ను మాత్రమే వినియోగించుకోవాలి. ప్లాస్టిక్ సంచులు ఎక్కడ పడితే అక్కడ పడేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

- రజనీకాంత్, ఎంపిడివో

## 13న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్ మాస్ సర్వీసెస్ సంస్థ, చెన్నై వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న బుధవారం కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు, ప్రస్తుతం డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్నవారు అర్హులని తెలిపారు. నెలకు రూ.13 వేలు నుంచి రూ.15 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఉచిత వసతి సదుపాయం ఉంటుందని.. ఆసక్తి గల అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7995802325, 9640656775 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## రీ సర్వే త్వరగా పూర్తి చేయాలి

**ప్రజాశక్తి-వెంకటగిరి:** రీ సర్వే త్వరగా పూర్తి చేయాలని వెంకటగిరి మండల తహశీల్దారు పద్మావతి సిబ్బందిని ఆదేశించారు. సోమవారసామె సిబ్బందితో సమావేశమై గ్రామాల్లోని రెవెన్యూ భూ సమస్యలను రీ సర్వేతో పరిష్కరించడానికి వీఆర్వోలు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుతో సమస్య చర్చించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. మండల ప్రజా పరిషత్ అభివద్ధి కార్యాలయంలో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న భూ సమస్యల వినతులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు శ్మశానాలు కేటాయించాలి

**ప్రజాశక్తి-తిరుపతి సిటీ:** దళిత క్రైస్తవులకు శ్మశానాన్ని కేటాయించాలని ఏపీ బిషప్ కౌన్సిల్ నాయకులు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జునను కోరారు. ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ అన్యువల్ జనరల్ బాడీ సమావేశం తిరుపతి ఓటేరులోని బెతస్తా ప్రార్థన మందిరంలో ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనేక క్రైస్తవ సంస్థలకు ఎఫ్‌సీఆర్ఏలు రద్దు చేశారని.. వాటిని పునరుద్ధరించాలని, దళితులకు శ్మశానాలు కేటాయించాలని, పాస్టర్లకి గౌరవ వేతనం అందరికీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు మంత్రి స్పందిస్తూ తప్పకుండా దళితులతో పాటు దళిత క్రైస్తవులకు శ్మశానాలు కేటాయించడం జరుగుతుందన్నారు. పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిషప్ కౌన్సిల్ అధ్యక్షులు బిషప్ ఏజ్జల బాలరాజు, ప్రధాన కార్యదర్శి బిషప్ వానాల డేవిడ్ రాజు, కోశాధికారి బిషప్ విక్టర్ పాల్, బిషప్ నవీన్ కుమార్, బిషప్ సిహెచ్ మోజెస్, 26 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, పాస్టర్లు పాల్గొన్నారు.

## ముగిసిన రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఐ సి ఎస్ ఎస్ ఆర్ రీజనల్ సెంటర్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపకులపతి ఆచార్య భారతి పరిశోధకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీ లో ఉన్నటువంటి క్లిష్టతరమైన సమస్యలకు రీసెర్చ్ ద్వారా సమాధానాలు కనుగొనవలెనని తెలిపారు. కన్సల్టెంట్ జాకబ్, కోర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ ఉమా, ప్రొఫెసర్ అనురాధ, డాక్టర్ ఇందిరా, డాక్టర్ మాధవి, డాక్టర్ అనురాధ, డాక్టర్ నీరజ, డాక్టర్ శ్రీరజిని, డాక్టర్ రూప, డాక్టర్ లత, డాక్టర్ వజీహ, రీసెర్చ్ స్కాలర్ లు పాల్గొన్నారు.

# సుస్థిర జీవనోపాధుల కల్పనే స్త్రీనిధి లక్ష్యం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్:** మండలంలోని ఎగువవీధి గ్రామంలో నిర్వహిస్తున్న కలంకారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ ఏ.వి.నాంచారయ్య సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతి మహిళా సుస్థిర జీవనోపాధి ఏర్పాటు చేసుకొని నెలకు కనీసం రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఆదాయం సంపాదించుకోవాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్కొక్క సభ్యురాలకు స్త్రీ నిధి నుంచి రూ.50 వేలు నుండి రూ.లక్ష పెంచినట్లు తెలిపారు. కలంకారీ యూనిట్లలో పనిచేస్తున్న వారికి సొంతంగా మార్కెటింగ్ చేసుకొనే సామర్థ్యం లేకపోవుటంతో నెల జీతంతో పని చేస్తున్నారన్నారు. దీనికి సెర్ప్‌లో ఆసక్తి కలిగి మహిళలకు ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని.. సొంతంగా క్లస్టర్ యాక్టవిటీ చేసుకొనే వారి నుంచి ప్రపోజల్స్ సిబ్బంది నుంచి ఇవ్వాలని తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతి, తిరుపతి జిల్లా స్త్రీనిధి ఏజీఎం హేమంత్ కుమార్, ఏరియా కోఆర్డినేటర్ కె.వి దినేష్ బాబు, ఏపీఎం మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలని ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు సూచించారు. స్థానిక సరస్వతి బాయ్ మున్సిపల్ హై స్కూల్ లో సుబ్బమ్మ మోహన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంజూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ 10 విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా సుబ్బమ్మ మోహన్ రావు ఫౌండేషన్ కృషి చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్, పివిఆర్ గ్రూప్ సంస్థ అధినేత ప్రతాప్ రాజు పవర్, జనార్ధన్ రావు జై పవర్, ముకుందరావు జై పవర్, గుమ్మడి బాలకృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, కొండూరు నంద, మాజీ కౌన్సిలర్ మహబూబ్ బాషా, పూల కృష్ణమూర్తి, రిటైర్డ్ హెడ్మాస్టర్ సత్యనారాయణ, బాలశెట్టి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన ఏర్పాటు

**ప్రజాశక్తి - తిరుమల:** తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల భద్రత దష్ట్యా ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈఓ ఏవి. ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో కార్యాలయంలో జేఈవో వీరబ్రహ్మంతో కలిసి విజిలెన్స్, పోలీస్, వైద్య ఆర్టీసీ, ఫారెస్ట్, స్విమ్స్, బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి అధికారులతో ఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిఈ నాగేశ్వరరావు, రవాణా విభాగం జిఎం శేషారెడ్డి, డిఎఫ్ఓ శ్రీనివాసులు, ఎస్టేట్ స్పెషల్ ఆఫీసర్ మల్లిఖార్జున, శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, బర్డ్ ఆర్ఎంఓ డా.కిశోర్, స్విమ్స్ డాక్టర్ రామ్, డిఎంహెచ్ ఓ శ్రీ శ్రీహరి, డిటిసి సీతారామి రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి జితేందర్‌నాథ్ రెడ్డి, తిరుమల ఏఎస్‌పి మునిరామయ్య, తిరుమల ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య, విజివో మనోహర్ పాల్గొన్నారు.

### మూగజీవాలకు దాణా అందజేత

**తిరుపతి (మంగళం):** తిరుపతి హథీరాంజీ మఠం ఆవులు నలబై ఐదు పైగా ఉన్నా వాటికి దాణామేత లేనందున అవి గత పదిరోజులుగా నీరు మాత్రం తాగే పరిస్థితి. సంపూర్ణ ఆహారం లేకుండా నీరసించి ఇబ్బందికి గురయ్యాయి. వీటిపై సమాచారం అందుకున్న ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి స్పందించి ఇరవై ఏడు బస్తాలు పీడు అమతం దాణాను (నలబై వేల రూపాయలు ఖరీదు) హథీరాంజీ మఠం పిట్ పర్సన్ విజయ సారథికి అప్పగించారు.

### కోదండరామస్వామి పవిత్రోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

**తిరుపతి సిటి :** కోదండరామస్వామి ఆలయ పవిత్రోత్సవాల బుక్ లెట్ ను ఈవో ఏవి. ధర్మారెడ్డి సోమవారం టీటీడీ పరిపాలన భవనంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. పవిత్రోత్సవాలకు 12న అంకురార్పణ జరగనుంది. 15న యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

### 13 నుంచి ఆండాల్ తిరువడిపురం ఉత్సవం

**తిరుపతి సిటి :** ఈనెల 13-22 తేదీల్లో గోవిందరాజస్వామివారి ఆలయంలో ఆండాల్ తిరువడిపురం ఉత్సవం జరగనుంది. జూలై 22న శ్రీ ఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు శ్రీ గోవిందరాజ స్వామివారు, శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుండి రామనగర్ క్వార్టర్స్ లోని గీతామందిరం , ఆర్ఎస్ మాడ వీధి లోని శ్రీ విఖనసాచార్యుల ఆలయం, శ్రీ చిన్నజీయర్ మఠం మీదుగా ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకుంటుంది.

### పదో తరగతి విద్యార్థులకు లయన్స్‌క్లబ్ చేయూత

**తిరుపతి టౌన్ :** శివజ్యోతి నగర్ తుంబవానిగుంట మునిసిపల్ పాఠశాల నందు పదోతరగతి అత్యుత్తమ మార్కులు పొందిన 20 మంది పేదవిద్యార్థులకు నగదు, ప్రోత్సాహకాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ద్వారా ఆదుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కోశాధికారి బెల్లంకొండ సురేష్, బాసికర్ల రఘు, రామారావు పాల్గొన్నారు.

## వైభవంగా భజనమండళ్ల శోభాయాత్ర

**తిరుపతి సిటి :** టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం భజనమండళ్ల శోభాయాత్ర వైభవంగా జరిగింది. మూడు రోజుల పాటు జరగనున్న శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవ ప్రారంభంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ హరినామ సంకీర్తన ప్రజల్లో అశాంతిని దూరం చేస్తుందన్నారు. కలియుగంలో స్వామివారిని సేవించడం ఎంతో పుణ్యఫలమన్నారు. సాంప్రదాయ భజనలు చేస్తూ సప్తగిరీశుని దర్శించుకుంటారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-గూడూరు:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్ మాట్లాడుతూ 2018 నుండి అపరిష్కృతంగా ఉన్న క్లైయిమ్స్ రిలీజ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్. కాలేషా, ఏఐటీయూసీ నాయకులు ఎంబేటి చంద్రయ్య, చైతన్య, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

**వరదయ్యపాలెం:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను బోర్డుకు అందజేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అంబాకం చిన్నిరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, యూసుఫ్ బాయ్, బాషా, తరుణ్ కుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

### 'వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు మానుకో'

**ప్రజాశక్తి-సత్యవేడు:** గ్రామ వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మానుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హితవు పలికారు. సోమవారం దాసుకుప్పం సచివాలయ ప్రాంగణంలో గ్రామ వాలంటీర్లపై పవన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి, జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ బాలాజీ రెడ్డి, గ్రామ సర్పంచ్ రవిరెడ్డి తదితరులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎంపిటిసి బాలయ్యరెడ్డి, వైసీపీ నేతలు శ్రీనివాసులురెడ్డి, సురుటుపల్లి మాజీ ఆలయ ట్రస్టు బోర్డు మెంబర్ జయప్రకాష్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్‌లో మాజీ బాదూరు సర్పంచ్ మల్లంపల్లి వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐహెచ్ఆర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ స్టేట్ వైస్ చైర్మన్ బాల నరసింహులు, రుయా హాస్పిటల్ జనరల్ సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదెప్ప, న్యాయవాది వేణుగోపాల్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్ల భద్రతపై దృష్టి సారించండి :కమిషనర్

**తిరుపతి టౌన్ :** నగరంలో రోడ్ల భద్రత, నిర్వహణకు సంబంధించి టిటిడితో సమన్వయంతో పనులు చేపట్టాలని కమిషనర్ హరిత ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు జారీ చేశారు. శ్రీనివాసం వద్ద రద్దీ విషయాన్ని ప్రస్తావించారు. మ్యూజిక్ కాలేజీ, టౌన్‌క్లబ్, కోర్టు వద్ద ఏర్పాటు చేస్తున్న ఫ్లైఓవర్ల వద్ద గోడలపై సందేశాత్మక, ప్రజాప్రయోజనకర చిత్రాలను చిత్రీకరించి త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఇ మోహన్, ఎంఇలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

### కార్పొరేటర్ల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** డయల్ యువర్ కమిషనర్, స్పందనకు వచ్చే ఫిర్యాదులను, అర్జీలను సకాలంలో పరిష్కరించాలని తిరుపతి నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సునీత అన్నారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ కార్పొరేటర్లు ప్రస్తావించే అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ అర్జీలను స్వీకరించారు. 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి వినతిపత్రం ఇస్తూ నగరంలో తెలుగుగంగ, అండర్ డ్రైనేజి కనెక్షన్లు చాలా మంది అక్రమంగా వినియోగిస్తున్నారని, అధికారులను ఈ విషయంపై నియమించి అక్రమాలు పాల్పడ్డ వారిని గుర్తించి, వారికి జరిమానాలు విధించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

**In The Court Of The Senior Civil Judge : Balaji District**
**I.P.No. 1 / 2023**
**Chaluvadhi Srinivasulu** - Petitoner
Vs
**1. Alavala Venkateswarlu**
and 34 otehrs - Respondents
**Notice**
**To,**
R1. **Alavala Venkateswarlu,** S/o **Bupaiah,** Park Street, Sullurpet, Thirupathi District.
R5. **Pasupuleti Hari,** S/o Not Known, Police Constable, Kavali, Nellore District.
R17. **Mogalluru Ramanjunamma,** W/o **Venkateswarlu,** Kacheri Street, Sullurpet, Thirupathi District.
R24. **Jampana Naga Raja Rao,** S/o Not Known, Door No.60/2003, Meenjuru, Main Raod, Tamil Nadu.
R25. **Vijayamma,** W/o **Vijay Kumar,** Sullurpet, Thirupathi District.
R26. **R. Nageswara Rao,** S/o Not Known, Bapuji Street, Sullurpet, Thirupathi District.
R27. **Bhaskar,** S/o Not Known, Door No. 4/5/231, Bapuji Street, Sullurpet, Thirupathi District.
R28. **Sivaji,** S/o Not Known, Kollamitta, Sullurpet, Thirupathi District.
R31. **Santhi,** W/o Not Known, Near Lakshmi Theatre, Bapuji Street, Sullurpet, Thirupathi District.
R33. **Rapurth Rama Krishna,** S/o Not Known, Ambapuram, Nellore Town, Nellore District.
R34. **Y. Shuba,** W/o **Babu**, High School Road, Sullurpet, Thirupathi District.
R35. **TK. Nirmala Devi,** W/o **Krishnaiah**, Bapuji Street, Sullurpet, Thirupathi District.

పై నెంబరు కేసులో పిటిషనరు పై కోర్టులో **I.P.No. 1 / 2023** దాఖలు చేసియున్నారు. సదరు **I.P.**లో మీకు నోటీసు నిమిత్తం **తే29-8-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
**టి.వి. సుబ్బారావు,** బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు తరపు న్యాయవాది, నెల్లూరు.

**In The Court Of The Senior Civil Judge : Balaji District**
**I.P.No. 2 / 2023**
**Chaluvadhi Padmavathi** - Petitoner
Vs
**1. Bayya Sravanthi**
and 43 otehrs - Respondents
**Notice**
**To,**
R7. **Doddaga Siromani,** S/o Not Known, S/o Not Known, Bapuji Colony, Sullurpet, Thirupathi District.
R14. **Nariboyina Venkateswarlu,** S/o Not Known, Bapuji Street, Sullurpet, Thirupathi District.
R16. **Mittadoddi Nagendra Kumari,** W/o **Vinod Kumar,** Bapuji Colony, Sullurpet, Thirupathi District.
R19. **Katamreddy Vinod,** Near RTC Bustand, Sullurpet, Thirupathi District.
R22. **K. Suvarna,** W/o **Lokesh,** Bazar Street, Sri Kala Hastri, Thirupathi District.
R24. **Bussam Vijayamma,** W/o Not Known, Srivari Nagar, Sullurpet, Thirupathi District.
R25. **Lakshmi,** C/o Keerthi Enclave, Sullurpet, Thirupathi District.
R27. **Ambati Aruna,** Bapuji Colony, Sullurpet, Thirupathi District.
R28. **Kaliveti Rama Krishna** Near Lakshmi Theatre, Sullurpet, Thirupathi District.
R35. **Jampa Nagar Raju,** Main Road, Meenjur, Tamil Nadu.
R36. **Chavali Lakshmi,** W/o **Siva Kumar,** Near Court Centre,Gudur, Thirupathi District.
R38. **S. Nagaiah,** Mannarupoluru Road, Sullurpet, Thirupathi District.
R42. **Parisineti Latheesh,** C/o **Y.Subha,** High School, Sullurpet, Thirupathi District.

పై నెంబరు కేసులో పిటిషనరు పై కోర్టులో **I.P.No. 2 / 2023** దాఖలు చేసియున్నారు. సదరు **I.P.**లో మీకు నోటీసు నిమిత్తం **తే29-8-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
**టి.వి. సుబ్బారావు,** బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు తరపు న్యాయవాది, నెల్లూరు.